వైద్యమో రామచంద్ర!

- గ్రామీణులకు దూరమైన ఫ్యామిలీ డాక్టర్
- కూటమి పాలనలో వైద్య సేవలకు ఇబ్బందులు
- మెరుగైన వైద్యానికి పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి
- ఊరిలోకి వచ్చే వైద్యుడు ఏడాదిగా కనిపించటం లేదు
- అవస్థలు పడుతున్న వృద్ధులు, మంచం పట్టిన రోగులు

ఏడాది పాలన
ఇదేనా బాబూ..



ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ వైద్య సేవలను పొందేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది క్రితంతో పోల్చుకుంటే వైద్య సేవల్లో ఎంతో తేడా ఉందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఫ్యామిలీ డాక్టర్ పేరుతో గ్రామాలకు వైద్యులతోపాటు 104 వాహనం వచ్చేది. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు నెలకు సరిపడా ఉచితంగా అందించేవారు. ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి మందులతోపాటు మెరుగైన వైద్య సేవలను అందించారని గతాన్ని గుర్తు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పాలనలో జగనన్న తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ పేరును మార్చి ప్రజల మనసుల నుంచి జగనన్నను దూరం చేసే ప్రయత్నాలను ఈ ప్రభుత్వం ముమ్మరం చేస్తుందని పలువురు విమర్శిస్తున్నారు.



నరసన్నపేట: మడపాంలో వైద్య తనిఖీలు చేసుకున్న వృద్ధురాలికి మందుల కిట్ అందజేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ (ఫైల్)

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలకు ఎలాంటి వైద్యం అవసరమైనా పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి ఇంటి వద్దకే ప్రభుత్వ డాక్టర్లు వచ్చేలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సరికొత్తగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చారు. నిపుణులైన డాక్టర్లు గ్రామాల్లోకి వచ్చి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి అవసరమైన వైద్య పరీక్షలు చేశారు. మందులు కూడా ఉచితంగా అందించేవారు. ఇంకా మెరుగైన వైద్య సేవలు అవసరం అనుకుంటే డాక్టర్ సిఫార్స్ మేరకు ప్రభుత్వమే కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్య సేవలను అందించేలా చర్యలు తీసుకునేవారు.



కొత్తూరు: కొత్తూరు సీహెచ్‌సీలో ఇటీవల వరండాలో రోగులకు వైద్యం అందిస్తున్న వైనం

కూటమి పాలనలో..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందకుండా పోయాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వ వైద్యం గ్రామీణ ప్రాంత ప్రజలకు అందడం కష్టమైంది. ఆస్పత్రికి వెళ్లే వైద్యులు తనిఖీలు చేసి వారి ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులు ఇచ్చి పంపించేస్తున్నారు. గ్రామాలకు 104 వాహనం ఎప్పుడు వస్తుందో..? ఎప్పుడు రాదో? తెలియని దుస్థితి నెలకొంది. వృద్ధులు, మంచం పట్టిన రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



ఎల్.ఎన్.పేట: రోగులు అందుతున్న వైద్య సేవలను తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి (ఫైల్)



నరసన్నపేట: నరసన్నపేటలో ఆరోగ్య తనిఖీల కోసం వచ్చిన ప్రజలు (ఫైల్)

అప్పట్లో వృద్ధులకు ఎంతో మేలు



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య శిబిరాలను నిర్వహించేవారు. గ్రామాలకు డాక్టర్లు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగానే ఇచ్చేవారు. పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లలేని వృద్ధులకు వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య శిబిరాలు లేవు.

– అశోక్ పాణిగ్రహి, లక్ష్మీనర్సుపేట, ఎల్.ఎన్.పేట

ప్రభుత్వ వైద్యానికి ప్రాధాన్యత లేదు



గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యం గతంలో అందినంత మెరుగ్గా ప్రస్తుతం అందటం లేదు. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన మందులే ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు అందజేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ పేరుతో జగనన్న గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించి అండగా నిలిచారు.

– పెనుమజ్జి విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల ప్రెసిడెంట్, యంబరాం, ఎల్.ఎన్.పేట

వైద్య శిబిరాలు లేవు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో ప్రజల వైద్య కోసం ప్రత్యేక శ్రద్ధ చూపేది. ఆరోగ్య సురక్ష పేరున గ్రామాలకు వైద్యులను పంపి ప్రజలకు ఇంటి వద్దనే వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు ఇచ్చేవారు. ఇప్పుడు గ్రామాల్లో క్యాంపులు లేవు. 104 ద్వారా సక్రమంగా తనిఖీలు చేయడం లేదు. గర్భిణులు, వృద్ధులు వైద్యం కోసం అవస్థలు పడుతున్నారు.

– లుకలాపు కళావతి, నడగాం, నరసన్నపేట

పాతపట్నం నియోజకవర్గంలో...	
సీహెచ్‌సీలు	2
పీహెచ్‌సీలు	11
హెల్త్‌వెల్త్ కేంద్రాలు	63
నరసన్నపేట నియోజకవర్గంలో..	
ఏరియా ఆసుపత్రి	1
సీహెచ్‌సీలు	1
పీహెచ్‌సీలు	9
హెల్త్‌వెల్త్ కేంద్రాలు	82
ఆమదాలవలస నియోజకవర్గంలో..	
సీహెచ్‌సీలు	1
పీహెచ్‌సీలు	10
హెల్త్‌వెల్త్ కేంద్రాలు	62

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



సామూహిక పూజలు చేయిస్తున్న రుత్వికులు

సారవకోట: మండలంలోని మహాశింగి పంచాయతీ కొత్తపేట గ్రామంలో అభయాంజనేయ స్వామి మందిర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. స్వామివారి ఉత్సవ విగ్రహానికి గ్రామంలో పల్లకీ సేవ నిర్వహించారు. రుత్వికులు రాజేశ్వర శర్మ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. నాలుగు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించి ఆదివారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మందిర నిర్మాణానికి రూ.14 లక్షలు విరాళాల రూపంలో సేకరించి నిర్మించినట్లు తెలిపారు.

ఈఓగా బాధ్యతల స్వీకరణ



రామచంద్రరావు

పాతపట్నం: మేజర్ పంచాయతీ ఈఓగా (డిప్యుటేషన్‌పై) ఊణ్న రామచంద్రరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజాం మండలంలోని నందబలగ పంచాయతీ సెక్రటరీగా పని చేసి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఈఓ వై.వరప్రసాద్ మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఎస్.కిశోర్ మెళియాపుట్టి మేజర్ పంచాయతీకి బదిలీపై వెళ్లారు. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా యు.రాజేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన నరసన్నపేట మేజర్ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఒకే యూనియన్‌గా ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశ్వబ్రహ్మణ సేవా సంఘం సభ్యులు

పాతపట్నం: రాష్ట్రంలో కార్పెంటర్ (వడ్రంగి) కులస్తుందరూ ఒకే యూనియన్‌గా ఉండాలని విశ్వబ్రహ్మణ సేవా సంఘం జిల్లా కన్వీనర్లు కానుగల నాగరాజు ఆచారి, పొట్నూరు వెంకట రమణ ఆచారి అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అందరూ కలిసి ఉండాలనే ఉద్దేశంతోనే ఒకే యూనియన్ కింద పేర్లు రిజిస్ట్రేషన్ చేశామన్నారు. పొట్నూరు సురేష్ ఆచారి, ఎల్.లక్ష్మణరావు, పి.రవి ఆచారి, డి.రవికుమార్, నీలమణిదుర్గ విశ్వబ్రహ్మణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా మధుసూదనరావు



పొందూరు: పొందూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సీహెచ్ మధుసూదనరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆంధ్ర యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ అండ్ ఆర్కియాలజీ ప్రొఫెసర్ పనిచేశారు. పొందూరు డిగ్రీ కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన

బూర్జ: మహిళల భద్రత కోసం శక్తి మహిళా యాప్‌పై ప్రజల్లో చైతన్యం కల్పించడం జరుగుతుందని స్థానిక ఎస్ఐ ఎం.ప్రవల్లిక అన్నారు. గురువారం మండలంలోని పెద్దపేట సచివాలయంలో కుట్టు మిషన్ శిక్షణ తీసుకుంటున్న మహిళలతో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు సిబ్బందితో ఒక శక్తి టీమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో శక్తి యాప్‌పై అవగాహన పర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బొంతు ఎత్తిపోతల పథకం పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సారవకోట: మండలంలోని బొంతు ఎత్తిపోతల పథకం పనులు పున: ప్రారంభించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మహేంద్రతనయ నది ఒడ్డున నిర్మించిన ఎత్తిపోతల పథకం బావి పనులను సంబంధిత శాఖాధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి రైతులకు సాగు నీరు అందిస్తామన్నారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, సురవరపు తిరుపతిరావు, మూకుళ్ల చిన్నయ్య, సాధు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో గురువారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటారు. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న జూనియర్ సివిల్ జడ్జి రోషిణి



నరసన్నపేట: మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్క నాటుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, అధికారులు



పాతపట్నం: అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్క నాటుతున్న సీడీపీఓ విమలారాణి



జలుమూరు: సురవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



ఎల్.ఎన్.పేట: దొంకలబడవంజలో మొక్క నాటుతున్న టెస్ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు



బూర్జ: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నరసన్నపేట: దేవాదిలో రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు



పాతపట్నం: పెద్దసీది హైస్కూల్ ఆవరణలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే గోవిందరావు, అధికారులు



సరుబుజ్జిలి: రావివలసలో మొక్క నాటుతున్న సర్పంచ్ వందాన కృష్ణ



ఎల్.ఎన్.పేట: మొక్క నాటుతున్న అధికారులు, నాయకులు

రక్తదానం.. ప్రాణదానం

- ఘనంగా ఆర్ట్స్ సంస్థ వార్షికోత్సవం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్

బూర్జ: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని పెద్దపేట గ్రామంలో గల ఆర్ట్స్ సంస్థ 33వ వార్షికోత్సవాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంస్థ ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 102 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సంస్థ 33 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు ఎందరో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఆదివాసీ రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ కల్పిస్తున్నారన్నారు. గోగునారతో తయారుచేసిన ఉత్పత్తులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గోపిదేవిపేటలో మొక్కలు నాటారు. రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నాబార్డు జిల్లా మేనేజర్ టి.నాగార్జున, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త కె.భాగ్యలక్ష్మి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆర్ట్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

హిరమండలం: ప్రభుత్వం సరఫరా చేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. హిరమండలం సచివాలయం వద్ద గురువారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. రాయితీపై ప్రతి రైతుకు ప్రభుత్వం విత్తనాలు అందిస్తుందన్నారు. ఎరువులు కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూలుగు మేనక, ఎంపీడీఓ కాశీప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం: ఈ నెల 6వ తేదీన స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి డివిజన్ విద్యుత్‌శాఖ ఏఈఈ జి.శంకరరావు గురువారం తెలిపారు. పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఆర్.ఎల్.పురం ఫీడర్‌లో మరమ్మతులు చేపడతామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు కాపుగోపాలపురం, చంగుడి, సరాలి, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

హిరమండలం, ఎల్.ఎన్.పేటలో..

హిరమండలం: స్థానిక విద్యుత్ సెక్షన్ పరిధిలోని హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లో ఉన్న అన్ని గ్రామాలకు ఈ నెల 6వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు గురువారం తెలిపారు. 33 కేవీ పాతపట్నం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద లైన్లు మార్చటంతోపాటు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు మరమ్మతులు చేపట్టనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ రెండు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పొందూరులో..

పొందూరు: పొందూరు టౌన్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ యోగేశ్వరరావు, ఏఈ సుధీర్‌లు గురువారం తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడతామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

కలశ యాత్ర..



కొత్తూరు మండలంలోని మెట్టూరు బిట్ ఆర్ఆర్ కాలనీలో శివాలయం ప్రతిష్ఠ సందర్భంగా గురువారం కలశాతో తీరువీధి నిర్వహించారు. మెట్టూరు బిట్-2 ఆర్ఆర్ కాలనీ, బిట్-3, మెట్టూరు సెంటర్‌లో విగ్రహాలను ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

– కొత్తూరు

కేవీజీకి ఘన సత్కారం

సరుబుజ్జిలి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరం జిల్లా పార్లమెంటరీ పరిశీలకులు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణను పురుషోత్తపురం గ్రామంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీకి సేవలందించినందుకు గుర్తించి ఈ పదవులు అందించిన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామంలో ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తుచేసుకుని ఆయనను అభినందించారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న గ్రామస్తులు

10 నుంచి సీతారామ మందిరం వార్షికోత్సవం

కొత్తూరు: కొత్తూరులోని సీతారామ మందిరం వార్షికోత్సవ పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు పలు అధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు తాతబాబు చెప్పారు. చివరి రోజు అన్నప్రసాద కార్యక్రమం, తెప్పోత్సవం ఉంటాయన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ



కల్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు



ధర్మాన కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: మండలంలోని రెడ్డికిపేట సమీపంలో బసివలస రోడ్డుకు ఆనుకొని పునర్ నిర్మించిన హలహలేశ్వరాలయం ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 2వ తేదీన ప్రారంభమైన ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. పార్వతీ పరమేశ్వరులకు శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామిజీ ప్రవచనాలు చేశారు. సత్యవరాగ్రహారానికి చెందిన రుత్వికులు విగ్రహాలకు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్‌లు అవ్వ రవీంద్రనాథ్, అల్లు అసిరినాయుడు, కమిటీ ప్రతినిధులు శిమ్మ లక్ష్మణరావు దంపతులు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..

హలహలేశ్వరాలయం ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కృష్ణదాస్‌ను సత్కరించారు.